విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి


ప్రొద్దుటూరు కల్చరల్: ప్రతిభ కనపరచిన విద్యార్థులతో సైన్స్‌క్లబ్ సభ్యులు


బద్వేలు: సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్, ప్రిన్సిపల్‌లు


కాశినాయన: విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలతో ఉపాధ్యాయ బృందం


పోరుమామిళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరేష్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మేధస్సును పెంపొందించుకుని గొప్పశాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సివి.రామన్ సైన్స్‌క్లబ్ జిల్లా కన్వీనర్ కేవీ.విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో సైన్స్‌కు విశేష ప్రాధాన్యం లభిస్తుందన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో పొందుపరచిన విధంగా విద్యాబోధన, పరిశోధనలు సాగాలన్నారు. ఎస్‌వీడీసీ కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 225 మంది విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియంలో గోవర్ధన్ ప్రథమ స్థానం(జెడ్పీహెచ్‌ఎస్ పొట్టిపాడు), హర్షవర్ధన్‌కుమార్ ద్వితీయ స్థానం (జెడ్పీహెచ్‌ఎస్ గంగిరెడ్డిపల్లె), వసుంధర తృతీయస్థానం (జెడ్పీహెచ్‌ఎస్ చిన్నకొమెర్ల), ఇంగ్లీషు మీడియంలో యశ్వంత్ ప్రథమ స్థానం (జెడ్పీహెచ్‌ఎస్ ఎర్రగుంట్ల), గణేష్ ద్వితీయ స్థానం (జెడ్పీహెచ్‌ఎస్ హిమకుంట్ల), లక్ష్మీహర్షిత తృతీయ స్థానం (జెడ్పీహెచ్‌ఎస్ తాళ్లప్రొద్దుటూరు) నిలిచారు. వీరికి వరుసగా రూ.3000, రూ.2000, రూ.1000లతో పాటు జ్ఞాపిక అందించారు.

ఎస్‌ఆర్‌ఐటీలో సైన్స్ డే వేడుకలు

స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి మాట్లాడుతూ సీవీ రామన్ సైన్స్ రంగానికి చేసిన సేవలను, ఆయన పరిశోధనల గురించి వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక బాలాజీ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సోలార్ ఎనర్జీ, డ్రిప్ ఇరిగేషన్, థర్మల్ విద్యుత్ తదితర నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ గురప్ప, సైన్స్ ఉపాధ్యాయులు సురేష్, రమేష్ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లేది సైంటిస్టులు

బద్వేలు : దేశ భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లేది సైంటిస్టులే అని ఎంఈఓ రఘురాములు పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్ళ పట్టణంలోని సెయింట్ ఆంటోనీస్ స్కూల్‌లో సైన్స్ డే సందర్భంగా దేశ భవిష్యత్తును ముందుకు తీసుకెళ్లిన ఎంతో మంది గొప్ప సైంటిస్టులను స్మరించుకుంటూ యూనిటీ ఇన్ డైవర్సిటీ అన్న సంకేతానికి సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రఘురాములు, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, ఎస్‌ఐ హరిప్రసాద్, ప్రిన్సిపల్ సునందరెడ్డి, సుధీర్‌రెడ్డిలు హాజరయ్యారు. ముందుగా వారిని శాలువా, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

కాశినాయన : విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా రాణించాలని సావిత్రీబాయిపూలే అవార్డు గ్రహీత పరిమళజ్యోతి, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్‌లు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం రవీంద్రబాబు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పరిమళజ్యోతి వేయించిన పలు రకాల వర్కింగ్ మోడల్స్, సైన్స్ ప్రయోగాలు, నమూనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులచే తయారు చేయించిన డ్రిప్ ఇరిగేషన్, త్రీడీ హాలోగ్రామ్, కార్బన్ డైఆక్సైడ్ విడుదల, నీటిసాంద్రత ప్రయోగం, బెలూన్ రాకెట్ వర్కింగ్ మోడల్ తదితర సైన్స్ ప్రయోగాలు అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో...

పోరుమామిళ్ల : జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెంకటాపురం జెడ్పీహెచ్‌ఎస్, వైష్ణవి ఉన్నత పాఠశాలలో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, ఫిజిక్స్ అధ్యాపకులు వెంకట్రావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ పాల్గొన్నారు. వెంకటాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు బాల అంకిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సైన్స్ డేలో విద్యార్థులు రూపొందించిన నూతన ప్రాజెక్ట్‌లను ప్రదర్శనలో పెట్టారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, చెన్నారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని వైష్ణవి ఉన్నత పాఠశాలలో మెగా సైన్స్ గెలాక్సీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ దశలోనే ఉన్నత గమ్యాన్ని పెట్టుకుని ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ మల్లికార్జున, కరస్పాండెంట్ రామకృష్ణ, డైరెక్టర్ కళ్యాణి పాల్గొన్నారు.

ఐడీపీఎస్‌లో...

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పిల్లలు పలు రకాలైన ప్రయోగాలను తయారు చేసి చూపించారు. వీటిలో రాకెట్ లాంచింగ్ స్టేషన్, గ్రహాలు, పిరమిడ్స్, సోలార్ సిస్టమ్, ఆస్కార్ ఫిల్మ్ అవార్డులు గెలుపొందిన చిత్రాల డాక్యుమెంటరీ, రోడ్డు భద్రత-సిగ్నల్స్, స్మార్ట్ సిటీ, సేన్సార్ సిస్టమ్, మైక్రో స్కోప్ తయారీ- పనితీరు, సహజ రంగుల తయారీ, సేవింగ్ ఎనర్జీ విత్ సెన్సార్ ఎస్కలేటర్, బ్యూటీ అండ్ బీస్ట్ ఇంకా పలు రకాలైన అంశాలపై పిల్లలు చేసి ప్రాజెక్టులను ఐడీపీఎస్, సీబీఐటీ చైర్మన్ వి.జయచంద్రారెడ్డి పరిశీలించారు.

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం మండలంలోని కందిమల్లాయపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాలైన ప్రయోగ ప్రాజెక్టులను తయారు చేయగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశీలించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రశంసించారు.


సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఐడీపీఎస్, సీబీఐటీ చైర్మన్ జయచంద్రారెడ్డి

క్లుప్తంగా

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ప్రొద్దుటూరు : స్థానిక సూపర్‌బజార్ రోడ్డులోని నెహ్రూ యువ కేంద్రం సహకారంతో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో మంగళవారం జాతీయ టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కేక్ కట్ చేసి మహిళలకు పంచి పెట్టారు. కుట్టు శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు.

నేడు పశువైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్‌పీ ప్రేరణ కుమార్, డీన్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్ డాక్టర్ జేవీ రమణ హాజరవుతారని ఆయన తెలిపారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం


పంట నమోదు కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగి, రైతులు

పోరుమామిళ్ల : రైతును రాజు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సరికొత్త పథకాలను రైతుల కోసం అమలు చేస్తున్నదని దమ్మన్నపల్లె సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. మంగళవారం మార్కాపురం గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ జొనాథన్, విలేజ్ సర్వేయర్ దావీదులు క్షేత్రస్థాయిలో పంటల వివరాలను సేకరించి నమోదు చేశారు. ఈ క్రాప్ నమోదు వల్ల రైతులకు ప్రయోజనం ఉందని, సాగు చేసిన ప్రతి పంట వివరాలు రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అసిస్టెంట్ తెలిపారు.

‘టీడీపీ నేతలవి దిగజారుడు రాజకీయాలు’

ప్రొద్దుటూరు : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సొంత వార్డులో అభ్యర్థిని గెలిపించుకోలేకపోయిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన రమణయ్యకు ప్రొద్దుటూరు నాయకులే మోసం చేశారన్నారు.

తిరుమలకు పాదయాత్ర

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలోని కోదండ రామాలయం నుంచి ఏప్రిల్ 24న తిరుమలకు పాదయాత్ర (కాలినడకన) వెళుతున్నట్లు ఆ గ్రామ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు తమ వెంట రావచ్చునని, వచ్చిన వారందరికి టిఫిన్, భోజనం ఉచితంగా కల్పిస్తామని పేర్కొన్నారు. 30వ తేదీ నాటికి తిరుమలకు చేరుకుంటామని తెలిపారు. పూర్తి వివరాలకు 9989493864, 9182099517 సంప్రదించాలని వారు కోరారు.

వెల్లాల పార్వతీదేవికి ప్రత్యేక పూజలు


వెల్లాలలో ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి మల్లె, జాజి, 108 నిమ్మకాయలతో అర్చకుడు వెంకటాచలపతి ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు దర్శించుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వార్డు హెల్త్ సెక్రటరీ రెబక తెలిపారు. స్థానిక బుద్దాయపల్లెలోని బీసీ గర్ల్స్ హాస్టల్‌లో టీబీ రోడ్డులోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎస్‌ఐఆర్‌డీ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, ఆశా వర్కర్స్ గంగాభవాని, రవణమ్మ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం


మాట్లాడుతున్న ఉద్యాన విశ్వవిద్యాలయం సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ

మైదుకూరు : సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు ప్రణాళికబద్ధంగా అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సంచాలకులు డాక్టర్ ఈ.కరుణశ్రీ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆరో శాస్త్రీయ సలహాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో వ్యవసాయ సంబంధిత, సహాయ శాఖల, పరిశోధనా సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం తోడైతే రైతులు మరింత నాణ్యమైన దిగుబడులను సాధిస్తారని పేర్కొన్నారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కేటీవీ రమణ మాట్లాడతూ ఉద్యాన పంటలకు పేరు గాంచిన రాయలసీమలో ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. పులివెందుల అరటి పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.సుశీల మాట్లాడుతూ అరటికి విలువ జోడించే విధానాల్లో శిక్షణ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని అన్నారు. నాబార్డు డీడీఎం విజయ విహారి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టులను రూపొందిస్తే తమ బ్యాంకు ఆర్థిక సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కడప ఏరువాక కేంద్రం అధిపతి టి.మురళీకృష్ణ, ఊటుకూరు పరిశోధనా కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త జాన్సన్, ఆత్మ పీడీ పద్మలత, బి.మఠం ఫిషరీస్ అధికారి బాలకుమార్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి ఆర్.సుధాకర్, వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న, లీడ్ బ్యాంకు మేనేజర్ దుర్గా ప్రసాద్, సెరికల్చర్ అధికారి వెంకట్రామ రాజు, వనిపెంట కేవీకే అధిపతి శ్రీవిద్యారాణి, శాస్త్రవేత్తలు మానస, హర్షిత, ఫిరోజ్ హుస్సేన్, అభ్యుదయ రైతులు బీపీ ప్రతాప్‌రెడ్డి, బాలనరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐ ప్రిలిమ్స్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్‌సెంటర్ విద్యార్థులు ఎస్‌ఐ ప్రిలిమ్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 45 మంది ఎస్‌ఐ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి ఫిజికల్ టెస్ట్‌కు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు సునీల్, సృజన్ తెలిపారు. వీరిని కోచింగ్ సెంటర్ డైరెక్టర్లతోపాటు అధ్యాపకులు దామోదర్, సలీంబాషా, సురేష్ అభినందించారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గాదెగూడూరు పశువైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కొర్రపాడు పశువైద్యాధికారిణి లక్ష్మీదేవి మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి మార్చి 31వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని రైతులను కోరారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి వినతి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆర్.నాయక్ కోరారు. మంగళవారం వైవీయూలో ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డిని హాస్టల్ సమస్యలపై కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టల్‌లో మెస్‌బిల్లు అధికంగా వస్తోందన్నారు. పెన్నాబ్లాక్‌లో తాగునీరు లేక డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూనియర్, సీనియర్ మెస్‌లను వేర్వేరుగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యర్థాలు.. చెరువుపాలు



మున్సిపల్ సిబ్బంది, పలువురి వ్యాపారుల నిర్లక్ష్యం వలన పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాగుల చెరువు డంపింగ్‌యార్డును తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా చెత్త, జంతు కళేబరాలతో నిండిపోయి కంపుకొడుతోంది. అలాగే చెరువులోని నీటితో సైతం పెద్దఎత్తున వ్యర్థాలు చేరాయి. దీంతో బైపాస్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళలలో వాకింగ్‌కు వెళ్లే పాదచారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యర్థాలు చేస్తుండటంతో చెరువు కలుషితమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. – బద్వేలు అర్బన్

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని మోక్షగుండం వీధి ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు బీకే.పావని బెహన్‌జీ పేర్కొన్నారు. స్థానిక మోడంపల్లెలో ఓం శాంతీల ఆధ్వర్యంలో మంగళవారం ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనా దర్శన ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరికి శివపరమాత్మని ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకే చోట దర్శించుకునేందుకు దేశంలోని పలు ప్రాంతాల్లో కొలువై ఉన్న జ్యోతిర్లింగాల నమూనాలను ఏర్పాటు చేశామన్నారు. నటరాజ కళాక్షేత్రం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఎమ్మెల్యే

ద్వాదశ జ్యోతిర్లింగాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఓంశాంతీలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓంశాంతీలు ఆరతి, జయంతి, జ్యోతి, రామకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెల్ల కుసుమ సాగు.. బహు బాగు


సాగులో ఉన్న తెల్ల కుసుమ


ముళ్లులుగా ఉన్న తెల్ల కుసుమ పూత దశలో ఉన్న దృశ్యం

మండలంలో తెల్లకుసుమను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మినుము పంట నూర్పిళ్ల అనంతరం కొంతమంది తెల్ల కుసుమను సాగు చేశారు. ఎకరాకు 5 నుంచి 8 కిలోలు విత్తనం అవసరం కాగా, మండలంలోని పలు ఈ పంటను విస్తారంగా సాగు చేశారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉండగా, ఈ పంట 110 నుంచి 120 రోజుల్లో పూర్తవుతుంది. ఎకరాకు దిగుబడి సరాసరి 5 నుంచి 6 క్వింటాళ్లు రావచ్చొని రైతులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నట్లు వ్యాపారులు చెప్పారు. కుసుమలను నూనెగా ఉపయోగిస్తుండటంతో మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. – రాజుపాళెం

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంలో మనమే ముందుండాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి విజయంలో ప్రొద్దుటూరు నియోజకవర్గమే ముందు వరుసలో కనిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ముఖ్య నేతలతో కలసి మంగళవారం సాయంత్రం స్థానిక శేగిరెడ్డి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మార్చి 1 నుంచి రోజూ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొంటానని తెలిపారు. ప్రతి కౌన్సిలర్, సర్పంచ్ నిర్దేశించిన ఓటర్లకు సంబంధించి బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. పట్టభద్రులకు సంబంధించి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 15వేలకుపైగా ఓటర్లు ఉన్నారని, ఉపాధ్యాయులకు సంబంధించి 1200లకుపైగా ఓటర్లు ఉన్నారని వివరించారు. ఉద్దేశ పూర్వకంగా టీడీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై విష్రపచారం చేస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తొలిమారు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను పోటీలో నిలిపిందన్నారు. మొత్తం 27వేల మంది ఓటర్లు ఉండగా, ఇందులో 12వేల మంది ప్రైవేటు ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయని, గత 30 ఏళ్లుగా తాను ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్నానని తెలిపారు. సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా ప్రచార కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు మద్దతు ఇవ్వాలి


– ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో న్యాయవాదులంతా తనకు మద్దతు ఇచ్చి ఓటు వేయాలని అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని వివిధ కోర్టుల పరిధిలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులను కలిశారు. ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే అందరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


లాయర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పాత దువ్వూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఓటర్లుగా నమోదైన పట్టభద్రులు, ఉపాధ్యాయుల జాబితాను గ్రామాల వారిగా పార్టీ నాయకులకు అందించామన్నారు. గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థించాలని పార్టీ నాయకులకు ఆయన సూచించారు.

పరామర్శ : దువ్వూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య యాదవ్, కొత్తపల్లె వెంకటరాముడులను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు.

వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలింపించాలి

చాపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం చాపాడు మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రులను కలసి వెన్నపూస రవీంద్రరెడ్డి తొలి ప్రాధాన్య ఓటు వేసేలా కోరాలన్నారు. ఎంపీపీ లక్షుమయ్య, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, జేష్టాది శాంతరాజు, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట : వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరులు జగన్మోహన్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఖాజీపేటలోని సచివాలయాలు, పాఠశాలలోని ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.